క్లుప్తంగా

వేసవి శిక్షణా శిబిరం



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

రైల్వేకోడూరు అర్బన్ : గ్రంథాలయ వేసవి శిబిరాలలో భాగంగా గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం సైన్స్, తెలుగు వ్యాకరణం మొదలగు అంశాలపై ప్రత్యేక తరగతులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెలవు దినాలలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబు, నరసింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ



అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రకాశం

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి అంగన్‌వాడీ సెంటర్‌ను బుధవారం ఎంపీడీఓ ప్రకాశం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్‌లో ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెట్టిందని, అంగన్‌వాడీకి వచ్చే చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు సులభమైన రీతిలో విద్యా బోధన అందించాలన్నారు. విద్యార్థులు, బాలింతలు, గర్భిణులకు మెనూ ప్రకారం భోజనం సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు

పెనగలూరు : పెనగలూరు అగ్రహారంలో ఉప సర్పంచ్ దేపూరు చిన్న వెంగల్‌రెడ్డి బోరు వేయించారు. వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా అగ్రహారానికి నీరు సక్రమంగా రాలేదని ప్రజలు వెంగల్ రెడ్డికి విన్నవించారు. స్పందించిన ఆయన బోరు వేయించి కాలనీ వాసులకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రజలు ఉప సర్పంచ్‌ను అభినందించారు.

బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి

రాయచోటి టౌన్ : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌శరణ్ సింగ్‌ను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ కన్వీనర్ వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. భారత దేశానికి పతకాలు తెచ్చిన మహిళా రెజ్లర్లు దేశ రాజధాని ఢిల్లీలో తమకు జరిగిన దానిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న పట్టించుకోని కేంద్రం తీరును వినయ్ ఖండించారు. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేసి విచారించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు పవన్, రఘు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అన్నదానం



ఆహార పొట్లాలను ఇస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. పట్టణానికి చెందిన రామక్రిష్ణ వర్ధంతిని పురస్కరించుకుని మిత్రుడు వంగిమళ్ల ప్రతాప్ ఆర్థిక సహాయంతో కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు, మదనపల్లెరోడ్డు, టీవీఎస్ షోరూంల సమీపంలో గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ ఆధ్వర్యంలో ఆహార పొట్లాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్, సభ్యుడు వినోద్‌కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శీతల గంగమ్మకు పూజలు



సిద్దవటం(ఒంటిమిట్ట) : శీతల గంగమ్మ దేవస్థానంలో బుధవారం 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, హోమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

లీవులు మంజూరు చేయండి

రైల్వేకోడూరు అర్బన్ : హెల్త్ సెక్రటరీలకు పని భారం తగ్గించి లీవులు మంజూరు చేయాలని ఏపీ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లీలావతి బుధవారం పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 రకాల ఆన్‌లైన్ యాప్‌లతో పనిభారం పెరిగిందని దానివల్ల మాతా శిశుసేవలు అందించలేక పోతున్నామని తెలిపారు. పని భారం తగ్గించాలని కోరారు.

నష్టపోయిన ఉద్యాన రైతులను ఆదుకుంటాం

రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా

సిద్దవటం(ఒంటిమిట్ట) : ఇటీవల పెనుగాలుల బీభత్సానికి దెబ్బతిన్న పంటలతో నష్టపోయిన ఉద్యాన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పెద్దపల్లి పంచాయతీ మందపల్లి గ్రామంలో పెనుగాలులకు దెబ్బతిన్న అరటి, బొప్పాయి, మామిడి తోటలను మేడా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న పంటల గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్, కలెక్టర్ విజయ రామరాజు దృష్టికి తీసుకువెళ్లి నష్టపోయిన ప్రతి రైతు కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే గాలులకు ఎగిరిపోయిన ఇంటి రేకుల షెడ్డును పరిశీలించారు. ఆరుగాలం కష్టించిన రైతులకు అకాల వర్షాలు, గాలుల కారణంగా పంట నష్టపోవడం బాధకరమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని వారిని ఆదుకొని అండగా నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్‌పర్సన్ ఏకుల రాజేశ్వరి రెడ్డి, తుర్రా ప్రతాప్, నాగం నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ కె.వి. సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం మండల కన్వీనర్ పల్లె సుబ్బరామిరెడ్డి, నాగం మురళి, రమణ, రవిచంద్రారెడ్డి, మోటకట్ల సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శేష వాహనంపై ఊరేగిన వేణుగోపాలుడు



శేషవాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలుడు

పెనగలూరు : వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి వేణుగోపాలస్వామి శేషవాహనంపై ఊరేగాడు. నాయుడు సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిపారు. రాత్రి 9.30 గంటలకు ఉభయదాతలు ఆలయానికి రాగానే హరికథ కాలక్షేపం ప్రారంభమైంది. ప్రతిరోజూ బ్రహ్మోత్సవాలలో హరికథ ఉంటుందని ఆలయ చైర్మన్ సుబ్బారెడ్డి, పురోహితుడు సుబ్బనరసయ్యలు తెలిపారు.

నేడు సింహ వాహన సేవ

బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం సింహ వాహన సేవ ఉంటుందని ఆలయ చైర్మన్ సుబ్బారెడ్డి తెలిపారు. ప్రజలు కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి కృపను పొందాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటనారాయణ

రాజంపేట టౌన్ : ప్రజల సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ వై.వెంకటనారాయణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో రెండు నెలలపాటు వేసవి ప్రభావం ఉంటుందని అందువల్ల ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జూన్ మాసం నుంచి వర్షాలు కురుస్తాయని, గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నందున విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందుగానే అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే రోజునే విద్యార్థులకు ప్రభుత్వం జగనన్న కిట్లను అందజేసేందుకు సర్వం సిద్ధం చేసిందని, అందువల్ల పాఠశాలలు ప్రారంభమైన తొలిరోజే విద్యార్థులందరికి జగనన్న విద్యాకానుక కిట్లు అందేలా చూడాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేయించాలన్నారు. సచివాలయ సిబ్బంది వలంటీర్ల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు గృహాలను వెంటనే నిర్మించుకునేలా అధికారులు వారిని ప్రోత్సహించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇంకా ఎక్కడైనా మౌలిక వసతుల పనులు పూర్తికాకుంటే ఆ పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. జగనన్నకు చెబుతాం కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీఓ బాలమునుస్వామి, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పేదల పక్షపాతి

రైల్వేకోడూరు : పరిపాలన అంటే ఎలా ఉండాలో చేసి చూపిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టి నాలుగేళ్లు గడిచిన నేపథ్యంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆదేశాల మేరకు మంగళవారం తన ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి తాను పేదల పక్షపాతినని జగన్ మోహన్‌రెడ్డి చాటిచెప్పారన్నారు. కార్యక్రమంలో మల్లు క్రిష్టారెడ్డి, హరిక్రిష్టారెడ్డి, ఆకేపాటి రంగారెడ్డి, బండారు మల్లి, శ్రీరామ్ వినోద్, దామర్ల సిద్దయ్య, రాజారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాపం.. తాటిముంజలతో ఉపశమనం



ప్రజలకు తాటిముంజలు అమ్ముతున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలో మండుతున్న ఎండలతో ఉపశమనం పొందడానికి ప్రజలు పండ్లు, జ్యూస్‌లను ఆశ్రయిస్తున్నారు. దీంతో వీటికి గిరాకీ ఏర్పడింది. దీనికి తోడు రాపూరు, గిద్దలూరు, తిరుపతి ప్రాంతాల నుంచి పలువురు చిరు వ్యాపారులు తాటిముంజలను చెట్టు నుంచి నేరుగా తీసుకొని వచ్చి ఇక్కడే వలిచి ఇస్తుండటంతో ప్రజలు కొనడానికి మక్కువ చూపుతున్నారు. 100 రూపాయలకు పది తాటిముంజులు చొప్పున అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.

పక్కాగా భూముల రీ సర్వే



భూ రీ సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ ఫర్హాన్ అహమ్మద్ ఖాన్

కలికిరి: ప్రభుత్వ లక్ష్యం దిశగా పక్కాగా భూ రీసర్వే చేయాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహమ్మద్ ఖాన్ అన్నారు. మండలంలోని గుండ్లూరు గ్రామ పరిధిలోని కొర్నమిట్టపల్లి, మేడికుర్తి గ్రామ పరిధిలోని మజ్జిగవాండ్లపల్లి సమీపంలో జరుగుతున్న భూ రీ సర్వే కార్యక్రమాన్ని జేసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏఆర్ఐ ప్రకారం రైతులకు నోటీసులు ఇవ్వడం జరుగుతోందా.. నోటీసులు అందుకున్న రైతుల స్పందన ఎలావుంది.., రైతుల అనుభవం, రికార్డుల ప్రకారమే సర్వే జరుగుతోందా తదితరాలపై సర్వే సిబ్బందిని విచారించారు. ప్రభుత్వం లక్ష్యం మేరకు పక్కాగా సర్వే చేసి రైతులకు మేలు చేకూర్చాలని ఆదేశించారు. కోర్టు కేసులు, తగాదాలు ఉన్నచోటు ఎదురయ్యే సమస్యలపై సిబ్బంది జేసీ దృష్టికి తీసుకువచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మేడికుర్తి గ్రామ సచివాలయాన్ని జేసీ తనిఖీ చేశారు. నవరత్నాలు పథకాలు, సచివాలయాల్లో అందుతున్న సేవలపై ఏర్పాటు చేసిన బోర్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా పోలీసు విధులు, బాధ్యతలను విచారించారు. ఎస్‌డీజీ సర్వే, గర్భవతులు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఏఎన్ఎంను విచారించారు. ఆన్‌లైన్‌లో సిబ్బంది హాజరును పరిశీలించి, సచివాలయ రికార్డులను పరిశీలించారు. సమస్యలతో సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల సిబ్బంది మంచిగా మసలుకోవాలని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

3న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పౌర్ణమి పురస్కరించుకుని జూన్ 3న అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. అరుణాచలంకు వెళ్లే భక్తులు ముందుగా టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9959225676, 7382875034ను సంప్రదించాలని తెలిపారు.

వీధి కుక్కల తరలింపు

రైల్వేకోడూరు : కోడూరు పట్టణంలో ఆయా వార్డుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలను బుధవారం ఉప సర్పంచ్ తోట శివసాయి చొరవతో పంచాయతీ సిబ్బంది అటవీ ప్రాంతాలకు తరలించారు. ఆయా కాలనీల్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించిన ఉప సర్పంచ్ తోట సాయి కుక్కలను ఇతర ప్రాంతాలకు తరలించేలా సిబ్బందికి ఆదేశించారు. దీంతో సిబ్బంది మంగళవారం 95 కుక్కలు, బుధవారం 105 కుక్కలను ప్రత్యేక వాహనంలో తరలించి బాలపల్లి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో విస్తృత సేవలు

రైల్వేకోడూరు అర్బన్ : వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు విస్తృతంగా సేవలు నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు గాధంశెట్టి సుమన్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఆంజనేయ స్వామి దేవస్థానంలో క్లబ్ ఆధ్వర్యంలో ఆపరేషన్‌లు చేయించుకున్న 30 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కలపాటి శ్రీధర్, తిరునామాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

లక్కిరెడ్డిపల్లె : టపాసుల దుకాణాలకు అనుమతులు తప్పనిసరి అని లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఎవరైనా టపాసులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు జాగ్రత్తగా వాహనాన్ని నడపాలన్నారు. హెల్మెట్ ధరించి ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. లక్కిరెడ్డిపల్లె టౌన్ పరిధిలోని వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా టౌన్ పరిధిలో ఉండే దుకాణాదారులు విలువైన బంగారు ఆభరణాలు, నగదు వారి వెంట తీసుకువెళ్లాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



పెనగలూరు : పెనగలూరు హైస్కూల్ పరిసర ప్రాంతాలలో బుధవారం సాయంకాలం ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేశారు. అధిక లోడు, రిజిస్ట్రేషన్ పత్రాలు లేని వాహనాల డ్రైవర్లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

పార్టీ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించండి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయచోటి టౌన్ : రాయచోటిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకోవడానికి స్థలాన్ని కేటాయించాలని రాయచోటి కాంగ్రెస్ నాయకుడు షేక్ అల్లాబకాష్ కలెక్టర్ గిరీషా పీఎస్‌ను కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రాయచోటి పట్టణ పరిధిలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు.

ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శిగా లవకుమార్



లవకుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా తుమ్మల లవకుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం పట్టణంలో అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన ఎంపిక చేశారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా కిరణ్ కుమార్, కార్యదర్శిగా లవకుమార్, ఉపాధ్యక్షుడిగా మహేష్, సహాయ కార్యదర్శిగా చరణ్, శ్రీనివాసులును ఎంపిక చేశారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేద కుటుంబాలకు ఒక వరం లాంటిదని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. పది మంది లబ్ధిదారులకు రూ.16.15లక్షల చెక్కులను అందజేశారు. వీటిలో లక్కిరెడ్డిపల్లె మండల పరిధిలోని బి.ఎర్రగుడి గ్రామం బ్రాహ్మణ ఎర్రగుడి కొండ్లవాండ్లపల్లెలోని బండ్రేవు నాగమునిరెడ్డికి రూ.50 వేలు, మల్లూరువాండ్లపల్లెకు చెందిన వల్లూరు రామకృష్ణారెడ్డికి రూ.1.5లక్షలు, చలమకుంటవారిపల్లెకు చెందిన కొక్కంటి సంజీవరెడ్డికి రూ.4లక్షలు అందజేశారు. అలాగే, చిన్నమండెం మండలంలోని దిగువ గొట్టివీడుకు చెందిన మూడె బాబుకు రూ.25 వేలు అందజేశారు. రాయచోటిలోని రవిహాల్ సమీపంలోని షేక్ బీబీ జాన్‌కు రూ.2 లక్షలు, ఆలీమాబాద్ వీధికి చెందిన షేక్ పర్వీన్‌కు రూ.2లక్షలు, ట్రంక్ సమీపంలోని షేక్ రోకియాబీకి రూ.2.5లక్షలు అందజేశారు. అలాగే రామాపురం మండలం బండపల్లె గ్రామం వెంకటరెడ్డిగారిపల్లెకు చెందిన నందలూరి రామకృష్ణారెడ్డికి రూ.లక్ష, ఊరగాయల సులోచనకు రూ.40 వేలు, హసనాపురం వసంత శ్రీనివాసుల రెడ్డికి రూ.2 లక్షల చెక్కులను అందజేశారు.

కార్మికవర్గ ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్

రాయచోటి అర్బన్ : కార్మికవర్గ ప్రయోజనాల పరిరక్షణే ఐఎఫ్‌టీయూ ధ్యేయమని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఆర్.హరి క్రిష్ణలు అన్నారు. స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో బుధవారం ఐఎఫ్‌టీయూ అన్నమయ్య జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై పోరాటాలను ఉధృతం చేసేందుకే జిల్లాకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు. ఆగస్టులో పెద్దఎత్తున ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభలు రాయచోటిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

జిల్లా కన్వీనర్‌గా మావులూరి విశ్వనాథ్

ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్‌గా మావులూరి విశ్వనాథ్‌ను ఎన్నుకున్నారు. కో - కన్వీనర్‌గా సుజ్ఞాన, కమిటీ సభ్యులుగా మస్రూన్ బీ, హైదర్‌ఖాన్, ఆంజనేయులు, గీత, కిరణ్, కుమారి, ఉమాదేవితోపాటు మరో 9 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ కడప నేత రాము, గంగావతి, ఇందిరమ్మ, నేతలు మదన్‌మోహన్, చలపతి, రమణ, పోరెడ్డి రమణారెడ్డి, రఘునాథ, పెద్దన్న, వెంకటరమణలతో పాటు పీలేరు, తంబళ్ళపల్లె, మదనపల్లె, రాయచోటి ప్రాంతాల నేతలు పాల్గొన్నారు.

మీ పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి

ఇంటింటి ప్రచారం నిర్వహించిన జెడ్పీ బాలికోన్నత పాఠశాల సిబ్బంది



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న హెచ్ఎం లక్ష్మీదేవి, సిబ్బంది

రాజంపేట టౌన్ : టెన్త్ ఉత్తీర్ణులైన బాలికలను ప్రభుత్వ బాలికల కళాశాలలో చేర్పించాలని జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం బి.లక్ష్మీదేవి బుధవారం అధ్యాపకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తమ కళాశాలలోని సౌకర్యాలపై ముద్రించిన కరపత్రాలను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. అనంతరం హెచ్ఎం విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది తమ పాఠశాలకు అనుబంధంగా ప్రభుత్వం బాలికల జూనియర్ కళాశాలను మంజూరు చేసిందన్నారు. అప్పుడు ఎంపీసీ గ్రూపు మాత్రమే మంజూరైందని, ఈ ఏడాది సీఈసీ గ్రూపు కూడా మంజూరైనట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎస్.కరీం, అధ్యాపకులు నీలకంఠేశ్వరరాజు, బి.శ్రీనివాసులు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ కంటైనర్ ఏర్పాటుకు చర్యలు



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీసీహెచ్ఎస్ డేవిడ్

రాజంపేట : రాజంపేట ఏరియా ఆస్పత్రిలో ఆక్సిజన్ కంటైనర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్ అన్నారు. బుధవారం ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్సిజన్ కంటైనర్‌కు ఎస్టిమేట్స్ వేసి జిల్లా కలెక్టరుకు నివేదిస్తామన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. సీమాంక్ సెంటర్‌లో కాన్పులు సంఖ్య గణనీయంగా పెరగాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమైన వైద్యసేవలు సకాలంలో అందేలా చూడాలన్నారు. సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయనతోపాటు డీఎంఅండ్‌హెచ్ఓ కొండయ్య, ఆసుపత్రి సూపరిండెంట్ డా.పీవీఎస్‌రాజు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

రాయచోటి టౌన్ : ఎరువులు, విత్తన షాపులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం రాయచోటి పట్టణ పరిధిలోని పలు ఎరువుల దుఖాణాలను ఉమ్మడి కడప జిల్లా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్‌మెంట్ అధికారి మసూద్ బాషా తనిఖీలో పాల్గొన్నారు. బస్టాండ్ సమీపంలోని విశ్వప్రసాద్‌రెడ్డి ఫర్టిలైజర్, రఘు అగ్రి కేర్‌లలో ఏక కాలంలో తనిఖీ చేశారు. రఘు అగ్రికేర్‌లో రికార్డులలో సరిగా నమోదు చేయని కారణంతో 43 క్వింటాళ్ల (రూ. 1,41,900లు) విత్తన వడ్లను అమ్మకాలను నిలుపుదల చేస్తూ స్థానిక ఏఓ దివాకర్ చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు వీటి అమ్మకాలు నిలుపుతున్నట్లు తెలిపారు. దాడులలో కడప రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయానికి చెందిన సీఐ రామకృష్ణ, ఏజీ మైన్స్ జి. శ్రీనివాసులు, ఏఈ అశోక్ కుమార్ వారి సిబ్బంది నాగేశ్వరావు, హరినాథ.రెడ్డి, రాయచోటి వ్యవసాయశాఖ అధికారి దివాకర్ పాల్గొన్నారు.

క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయి



శిక్షణ పొందిన కరాటే క్రీడాకారులతో కోచ్‌లు

మదనపల్లె సిటీ: క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని డీఎస్‌డీఓ షేక్ షఫీ తెలిపారు. బుధవారం స్థానిక కోటవీధిలోని హోప్ మున్సిపల్ పాఠశాలలో వేసవి కరాటే శిబిరంలో పాల్గొన్న కరాటే శిక్షకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 40 రోజుల పాటు జరిగిన శిక్షణ పొందిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో రెండు శాతం మార్కులు కలపడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. అందుకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కరాటే ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం సాధ్యమని ఇందుకు కఠోరమైన సాధన ద్వారానే ఉన్నత లక్ష్యాలను సాధించడానికి అవకాశం లభిస్తుందన్నారు. విద్యార్థులు ఫోన్, టీవీ, సోషియల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ క్రీడలు, కరాటే నేర్చుకొని ధైర్యవంతులుగా సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో కరాటే కోచ్ ఎ.ఆర్.సురేష్, డాక్టర్ పాల్ రవికుమార్, టుటౌన్ హెడ్ కానిస్టేబుల్ రామమూర్తి,మణిసాయి, రమణ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట సాగుపై అవగాహన

గుర్రంకొండ: ఖరీఫ్ సీజన్‌లా సాగు చేసే వేరుశనగ పంట సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలకేంద్రమైన గుర్రంకొండ ఆర్బీకేలో వేరుశనగ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటసాగులో ఎకరానికి 60 కేజీల విత్తన గింజలు వేసుకోవాలన్నారు. విత్తన శుద్ధి అనే ఎమ్-45 అనే మందు మూడు గ్రాములు, లేదా టి విరడి 8-10 గ్రాములు విత్తనాల్లో చల్లి విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. దినివలన మొక్కలు సాంద్రత పెరగడమే కాకుండా వేరుకుళ్లు వంటి రోగాలు సోకవన్నారు.జిప్సం ఎకరానికి 20 కేజీల చొప్పున విత్తనాలు నాటిన 30 నుంచి 40 రోజుల్లోగా పంటపై పిచికారీ చేయాలన్నారు. దీని వలన గింజల్లొ నూనె శాతం పెరగడమే కాకుండా గింజ గట్టి పడుతుందన్నారు. వేరుశనగ పంట చుట్టూ మూడుసాళ్లు కొన్న లేదా సజ్జలు లేదా మొక్కకొన్నలు కంచెగా వేసుకోవాలన్నారు. డ్రోన్ అనేది రైతులు గ్రూపుగా ఏర్పడి తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

డ్రోన్ విలువ రూ.10 లక్షలు కాగా రూ.5లక్షలు బ్యాంకు రుణం, మరో రూ.5లక్షలు సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రత్నమ్మ, వీహెచ్ఏలు నవాజ్, శిరీష, రైతులు పాల్గొన్నారు.